క్లుప్తంగా

విద్యార్థికి అభినందన



ఆశిష్‌ను సత్కరిస్తున్న పేరాడ తిలక్

మెళియాపుట్టి: మండలంలోని పట్టుపురం గ్రామానికి చెందిన పాట్నూరు ఆశిష్ నీట్‌లో టాప్ ర్యాంక్ సాధించి ఢిల్లీ ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ సీట్ సాధించారు. ఆశిష్‌ను రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంట్ ఇన్‌చార్జి పేరాడ తిలక్ బుధవారం అభినందించారు. పట్టుపురం గ్రామంలో సత్కరించారు. ఓపెన్ కేటగిరిలో సీటు సంపాదించడం అభినందనీయమన్నారు. డాక్టర్ సూర్యం, పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య జెండాలు

నరసన్నపేట: మండల కేంద్రంలో ఇంటింటికీ అయోధ్య జెండాలు పంపిణీ చేస్తున్నట్లు కళింగ కోమట్ల సంఘం ప్రతినిధి సుధాకర్ తెలిపారు. ఈ నెల 22న అయోధ్యలో రామమందిరం ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా దాతల సహకారంతో వీటిని ఇంటింటికీ ఇస్తున్నట్లు చెప్పారు. ఊణ్ణ రంగనాథ్ వంద జెండాలు వితరణ చేయగా వాటిని నేతాజీ వీధిలో బుధవారం పంపిణీ చేశామన్నారు. పట్టణంలో ఇప్పటివరకు వెయ్యి జెండాలు పంపిణీ చేశామన్నారు.

మహిళా సంఘాలకు ఆర్థిక భరోసా

ఎల్.ఎన్.పేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం మహిళా సంఘాలకు ఆర్థిక భరోసాను కల్పించారని శ్యామలాపురం పునరావాస కాలనీ సర్పంచ్ బలగ లక్ష్మి అన్నారు. కాలనీకి చెందిన శ్రీసత్యసాయి స్వయం శక్తి సంఘానికి నాలుగు విడతల్లో రుణమాఫీగా రూ.1,95,535 రుణమాఫీ వచ్చిందన్నారు. బుధవారం శ్యామలపురం పునరావాస కాలనీలో సత్యసాయి స్వయం శక్తి సంఘానికి చెందిన సభ్యులతో సమావేశమయ్యారు. నాలుగో విడతగా వచ్చిన రూ.47,590 రుణమాఫీ నగదు వివరాలను సంఘ సభ్యులకు వివరించారు. వైకేపీ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో దూడ మృతి

జలుమూరు: అల్లాడ గ్రామానికి చెందిన హనుమంతు తేజేష్ దొర అనే రైతుకు చెందిన ఆవుదూడ బుధవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద నుంచి సపోర్టు వైరు ద్వారా విద్యుత్ ప్రవహించి దూడకు తగలడంతో మృతి చెందిందని తెలిపారు. సుమారు రూ.25 వేల విలువ ఉంటుందన్నారు. పశు వైద్యులు కె.నారాయణమూర్తి పరిశీలించి పంచనామా చేశారు. ప్రభుత్వపరంగా నష్టపరిహారం అందించాలని బాధిత రైతు కోరుతున్నారు.

ఆకట్టుకున్న బల ప్రదర్శనలు



వెయిట్ లిఫ్టింగ్‌లో సత్తాచాటిన రాజ్యలక్ష్మి



వెయిట్ లిఫ్టింగ్‌లో సత్తాచాటిన ఆవల గోవిందరావు

జలుమూరు: మండలంలోని పాగోడులో ఉమా రామలింగేశ్వర ఆలయ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం బల ప్రదర్శనలు నిర్వహించారు. వెయిట్ లిఫ్టింగ్ పురుషుల విభాగంలో ఆవల గోవిందరావు(నిమ్మాడ), ముద్దాడ తరుణ్ కుమార్(తంగివానిపేట), ఎస్.రజాక్ (రాపాక), మహిళల విభాగంలో బి.రాజ్యలక్ష్మి(కొర్లకోట), సీహెచ్ హరికరాజ్(కొర్లకోట) విజేతలుగా నిలిచారు. ఈడుపురాయి విభాగంలో ఆవల గోవిందరావు, తీతసంగిడిలో గేదెల సత్యనారాయణ(వప్పంగి) విజేతలుగా నిలిచి బహుమతులు గెలుచుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దామ మన్మధరావు, ఎంపీటీసీ రావాడ చందనబాబు, ఉత్సవ కమిటీ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్ విజేత టెక్కలి

సారవకోట: మండలంలోని చిన్నగుజ్జువాడ పంచాయతీ పురుషోత్తకర్ర గ్రామంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో టెక్కలి జట్టు విజేతగా నిలిచింది. కొంకాడ అనిల్ జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ పోటీల్లో 20 జట్లు పాల్గొన్నాయి. బుధవారం జరిగిన ఫైనల్లో పాతపట్నం జట్టుపై టెక్కలి జట్టు విజయకేతనం ఎగురవేసింది. విజేతలకు ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగేశ్వరరావు బహుమతులు ప్రదానం చేశారు.



సరుబుజ్జిలి: జాతరకు హాజరైన ప్రజలు

ఉత్సవ వైభవం



సరుబుజ్జిలి: పూజలు అందుకుంటున్న ఉమాకామేశ్వరస్వామి



సరుబుజ్జిలి: ఉమాకామేశ్వర స్వామి రథయాత్రలో పాల్గొన్న భక్తులు



ఆమదాలవలస రూరల్: ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన జెయింట్ వీల్



ఆమదాలవలస రూరల్: షేకింగ్ వీల్‌పై చిన్నారులు, యువత సందడి

సరుబుజ్జిలి: మండలంలోని పురుషోత్తపురంలో ఉమాకామేశ్వర స్వామి వారి రథయాత్ర బుధవారం వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను వేదమంత్రాల మధ్య ఆలయ అర్చకులు గంగవరపు వాసుదేవశర్మ, ఆనందశర్మలు రథంపైకి తరలించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో తిరువీధి నిర్వహించారు. గ్రామస్తులు, భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం తోట జాతర కార్యక్రమం చేపట్టారు. ఈ జాతరకు జలుమూరు, సరుబుజ్జిలి, ఆమదాలవలస మండలాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

సంగమయ్య జాతర..

ఆమదాలవలస రూరల్: మండలంలో గాజులకొల్లివలస గ్రామం సమీపంలో సంగమేశ్వర ఆలయం వద్ద ముక్కనుమ రోజు బుధవారం నిర్వహించిన జాతర భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రతీ ఏడాది సంక్రాంతిని పురస్కరించుకుని మూడు రోజులపాటు నిర్వహించే ఈ జాతర ముక్కనుమ రోజు ముగియడంతో జిల్లా, ఇతర ప్రాంతాల నుంచి భక్తులు వస్తారు. కొండపై ఉన్న సంగమయ్యకు ప్రత్యేక పూజలు చేస్తారు. ఎటువంటి అల్లర్లు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

అభివృద్ధికి ప్రణాళికలే కీలకం



పాతపట్నం: మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ కృష్ణారావు

పాతపట్నం: గ్రామ పంచాయతీల ఆదాయాభివృద్ధికి కీలకమైన జీపీడీపీ కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, సర్పంచ్‌లు, ఎంపీటీసీలపై ఉందని ఎంపీడీఓ పి.జయంత్ ప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈఓపీఆర్డీ కృష్ణారావు మాట్లాడుతూ ప్రతి పంచాయతీలోనూ ఆదాయాభివృద్ధి మార్గాలను అన్వేషించి, అందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. సూపరింటెండెంట్ రాజేశ్వరరావు, మిశ్రో, అరుణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ ప్రణాళికలు సిద్ధం చేయాలి

నరసన్నపేట: రానున్న ఆర్థిక సంవత్సరానికి పంచాయతీల వారీగా అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీఓ బి.మధుసూదనరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం సచివాలయాల పరిధిలో ఉన్న ఇంజినీరింగ్, డిజిటల్ అసిస్టెంట్లకు గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎటువంటి సమస్యలను గుర్తించాలని, ప్రణాళికల్లో ఎటువంటి వాటికి ప్రాధాన్యత ఇవ్వాలనేది వివరించారు. ఆదాయం పెంచేందుకు ఎటువంటి చర్యలు తీసుకోవాలనే దానిపై పలు సూచనలు చేశారు. ఈఓపీఆర్డీ రామకృష్ణారావు, లుకలాం పంచాయతీ కార్యదర్శి కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికలు తయారు చేసుకోవాలి..

సారవకోట: గ్రామ పంచాయతీలకు అభివృద్ధి ప్రణాళికలు తయారు చేసుకోవాలని ఎంపీడీఓ రాంబాబు సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో జీపీడీపీ, బీపీడీపీ ప్రణాళికలపై పంచాయతీ కార్యదర్శులు, మండల, గ్రామస్థాయి అధికారులకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గ్రామ పంచాయతీల వారీగా అభివృద్ధి ప్రణాళికలు తయారు చేసుకోసుకుని వాటి కోసం కేటాయించిన ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఈఓపీఆర్డీ రేణుక ఉన్నారు.

నలుగురు జూదరుల అరెస్ట్

కొత్తూరు: మండల కేంద్రంలోని సమీప పంట పొలాల్లో జూదం ఆడుతున్న నలుగురు వ్యక్తులను బుధవారం అరెస్టు చేసినట్లు స్థానిక ఎస్‌ఐ ఎం.ఎ.అహమ్మద్ తెలిపారు. వారి వద్ద రూ.10,610 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

చెత్తసేకరణ డబ్బాల వితరణ

పాతపట్నం: మండల కేంద్రంలోని నీలమణి దుర్గ ఆలయానికి నాలుగు చెత్త సేకరణ డబ్బాలను పాతపట్నంకు చెందిన ఫొటోవీన్, డీజీవీన్ అధినేత గేదెల ప్రవీణ్ బుధవారం అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ నూలు ఈశ్వరావు, ఆలయ క్లర్క్ సుదర్శన్‌కు డ్రమ్‌లను అందజేశారు. రేగేటి వెంకటరమణ, గేదెల భరత్ కుమార్, రగుతు షణ్ముఖరావు, గొట్టిపల్లి రవికుమార్, బోను గురివి నాయుడు, అమర చిరంజీవి, నవీన్, మేఘనాథ్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

చురుగ్గా వంశధార ప్రాజెక్టు పనులు



పాలకొండ రోడ్డులో నిర్మించిన బ్రిడ్జికి తలుపులు బిగిస్తున్న దృశ్యం

కొత్తూరు: వంశధార ప్రాజెక్టు పనులు ముమ్మరం చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో మండలంలోని గూనభద్ర బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ గేట్‌లు పనులు చేపట్టారు. బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి హిరమండలం రిజర్వాయర్‌కు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన గేట్లుకు చక్రాలు బిగిస్తున్నారు. బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు వరదనీరు వచ్చే కాలువకు (కొత్తూరులోని పాలకొండ రోడ్డులో) నిర్మించిన బ్రిడ్జికి ఇనుప తలుపులను బిగించారు.

● సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మెళియాపుట్టి: మండలంలోని గిరిజన గ్రామాల అభివృద్ధికి సహకరిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతికి వైఎస్సార్‌సీపీ మండల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు గూడ ఎండయ్య, ఉదయ్ కుమార్, పి.యోగి, పలువురు గిరిజన ప్రజాప్రతినిధులు బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కోట్ల రూపాయల నిధులు విడుదల చేసి, ఎత్తైన కొండలో ఉన్న గిరిజన గ్రామాలకు రహదారులు నిర్మించడానికి సీఎం జగన్ నిధులు మంజూరు చేశారన్నారు. నేడు హడ్డివాడ గ్రామానికి రహదారి నిర్మాణం పూర్తయిందన్నారు. కేరాసింగి, చందనగిరి, గూడ తదితర గ్రామాలకు రహదారుల నిర్మాణాలు వేగవంతం చేస్తున్నామన్నారు. సీఎం జగన్‌తోనే ఇది సాధ్యమైందన్నారు. ఎత్తైన కొండలపై ఉన్న గిరి గ్రామాలకు వెళ్లడానికి సాహసం చేసి వారి సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే రెడ్డి శాంతి చేసిన కృషి, పట్టుదల అభినందనీయమన్నారు. పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తో అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయులు విష్ణుమూర్తి, రామారావు, తదితరులు

ఎల్.ఎన్.పేట: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తరువాత సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యత ఇచ్చారని వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు పెనుమజ్జి విష్ణుమూర్తి, మండల ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీపీ చాంబర్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఎల్.ఎన్.పేట మండల కేంద్రం 1999లో ఏర్పాటైందన్నారు. అప్పటినుంచి అధికారంలోకి వచ్చిన పాలకులు ఎల్.ఎన్.పేట మండలానికి పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయటంలో నిర్లక్ష్యం వహించారని గుర్తుచేశారు. పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి చొరవ తీసుకుని పోలీస్ స్టేషన్ ఏర్పాటు కోసం నేరుగా సీఎం జగన్‌ను వినతిపత్రాన్ని ఇచ్చారని తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం జగన్.. తన ముఖ్య సలహాదారు ధనుంజయరెడ్డితో మాట్లాడి పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. ఈ మేరకు పోలీసు అధికారులకు ఆదేశాలు అందాయన్నారు. మండలం పరిధిలో అధ్వానంగా ఉన్న అలికాం–బత్తిలి (ఏబీ) రోడ్డు అభివృద్ధి కోసం రూ.2.04 కోట్ల నిధులు విడుదల చేశారని పేర్కొన్నారు. పది రోజుల వ్యవధిలో రోడ్డు అభివృద్ధి పనులు పూర్తి చేశారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సీఎం జగన్, పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతికి మద్దతుగా నిలవాలని కోరారు. పార్టీ నాయకులు ఈగల చిన్నారావు, ముద్దాడ లక్ష్మణరావు, బలగ గోవిందరావు, తలసముద్రం శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

● అపూర్వ కలయిక



కొత్తూరు: 2000-01 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు



పొందూరు: ఒకేచోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పొందూరు: పిల్లలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి 2019లో చదువుకున్న విద్యార్థులు బుధవారం ఆత్మీయం సమ్మేళనం ఏర్పాటు చేశారు. 60 మంది విద్యార్థులు ఒకేచోట కలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయులు సుగ్గు కాసులబాబు, జీవీ రమణరావు, తమ్మినేని మురళీమోహన్, ఎన్.రవిబాబు, ఉపాధ్యాయేతర సిబ్బందిని సన్మానించారు.

సైకిల్ షెడ్ నిర్మాణానికి రూ.లక్ష విరాళం..

కొత్తూరు: కడుము జెడ్పీహెచ్‌ఎస్‌లో 2000–2001 చెందిన పదో తరగతి విద్యార్థులు బుధవారం పాఠశాల ఆవరణలో అపూర్వ సమ్మేళం నిర్వహించారు. పూర్వ విద్యార్థి ఎస్.వైకుంఠరావు పాఠశాలలో సైకిల్ షెడ్ నిర్మాణానికి రూ.లక్ష విరాళంగా అందజేశారు. 23 ఏళ్ల తరువాత అందరూ ఒకేచోట కలుసుకోవడంతో ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు.

రక్తదానం.. ప్రాణదానం



రక్తదానం చేస్తున్న మహిళలు



రామజోగినాయుడు కుటుంబానికి చెందిన నాలుగు తరాలు

ఆమదాలవలస రూరల్: రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడవచ్చునని ఏపీ ఎన్జీవో రాష్ట్ర సహాధ్యక్షుడు చౌదరి పురుషోత్తమనాయుడు అన్నారు. మండలంలోని కణుగులవలసలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ దివంగత బొడ్డేపల్లి రామజోగినాయుడు శత జయంతి వేడుకను కుటుంబ సభ్యులు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పురుషోత్తమనాయుడు మాట్లాడుతూ ఆపద సమయంలో సరైన సమయానికి రక్తం అందకపోవడం వల్ల చాలా మంది ప్రాణాలు కోల్పోవలసి వస్తుందన్నారు. రక్తదానంపై ప్రజలు అపోహలు వీడి స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. సమాజసేవ చేయడానికి ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మొక్కల పెంపకం వల్ల పర్యావరణాన్ని పరిరక్షించవచ్చునని డీసీసీబీ డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు అన్నారు. రామజోగినాయుడు కుటుంబానికి చెందిన నాలుగు తరాలవారు ఒకే వేదికపై ఆత్మీయంగా కలిశారు. చౌదరి తేజేశ్వరరావు, సంపూర్ణమ్మ, చౌదరి రవీంద్ర, చౌదరి సతీష్, బగాది రాజగోపాలరావు, బొడ్డేపల్లి అనిల్, నిరంజన్, నితిన్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గిరిజన సంప్రదాయం

మెళియాపుట్టి:

కళలు అంతరించిపోతున్న తరుణంలో గిరిజనులు వాటిని ఇప్పటికీ ప్రదర్శిస్తూ జీవం పోస్తున్నారు. సంక్రాంతి నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన గిరిజనులు గ్రామీణ కళలు, జానపద నృత్యాలు చేస్తూ మండల కేంద్రంలోని పలు వీధుల్లో బుధవారం ఆకట్టుకున్నారు. సంప్రదాయ కళలను ప్రజలు ఆసక్తిగా తిలకించారు. పరశురాంపురం పంచాయతీకి చెందిన భాస్కరరావు, దీనబంధుపురం గ్రామానికి చెందిన గిరిజన కళాకారులు హరిపురం దండాశి, లోకొండ కృష్ణారావు, జన్ని సోమేష్ మాట్లాడుతూ.. మన కళలు, సంస్కృతి, సంప్రదాయాల గురించి భావితరాలకు తెలియజేయాల్సి ఉందన్నారు. వాటిని కాపాడుకోవడానికి తమవంతు కృషి చేస్తున్నామన్నారు.



మెళియాపుట్టిలో గ్రామీణ కళలను ప్రదర్శిస్తున్న గిరిజనులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



తీవ్రంగా గాయపడిన నవీన్‌కుమార్

బూర్జ : మండలంలోని శ్రీకాకుళం–పాలకొండ ప్రధాన రహదారిలో పెద్దపేట జంక్షన్ వద్ద ప్రైవేటు అంబులెన్స్, స్కూటీ ఢీకొన్న ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బుధవారం శ్రీకాకుళం నుంచి పాలకొండ వైపు అంబులెన్సు వెళ్తుండగా.. అదే సమయంలో రామన్నపేట నుంచి మదనాపురం జంక్షన్ వైపు పాలవలస గ్రామానికి చెందిన అల్లుబోయిన చంద్రశేఖర్, రామన్నపేటకు చెందిన లావేలి నవీన్‌కుమార్ స్కూటీపై వస్తున్నారు. రెండు వాహనాలు పరస్పరం ఢీకొనడంతో చంద్రశేఖర్ కుడి కాలు విరిగిపోగా, నవీన్‌కుమార్ తలకు బలమైన గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. నవీన్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై బి.అశోక్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.